# అపరాజిత

## కథ

''నాన్నగారూ అలా ఆ చెట్టు క్రింద చూడండి! పాపం ఆ అబ్బాయి గాలివానలో యిబ్బంది పడుతున్నాడు! వాన వెలిసే వరకూ అతనిని మన గుమ్మంలో వుండ మంటే?'' అంది శారద.

విశ్వనాథం గారు అటు చూసేరు. నిజమే రోడ్డు ఆవలి వేపు వున్న వేపచెట్టు క్రింద ఎవరో అబ్బాయి నిల్చున్నాడు. అయితే వానకి తోడు గాలి కూడ వుండడం వల్ల ఆ వేప చెట్టు అతనికి ఏమాత్రం రక్షణ యివ్వలేకపోతోంది. విశ్వనాథంగారు గొడుగు వేసుకొని వెళ్లి అతనిని తీసుకొని వచ్చేరు.

గోపీకృష్ణ వరండాలో సైకిల్‌స్టాండ్ వేసి జేబురుమాలుతో ముఖం చేతులూ తుడుచుకుంటున్న సమయంలో విశ్వనాథంగారు టవల్ యిచ్చి ''అలా కూర్చుని తల తుడుచుకో బాబూ!'' అన్నారు. అతను మొహమాట పడక టవల్ అందుకొని తల తుడుచుకొని ప్రక్కనే వున్న బల్లమీద కూర్చు న్నాడు.

అతను ప్రతి దినం ఉదయం 7-30 గంటలకు వారింటి మీదుగా సైకిల్ మీద వెళ్లి సాయంత్రం 5-30 గంటలకు తిరిగి రావడం తరుచు చూస్తు న్నారు విశ్వనాథంగారు. అతని వివరాలు కేజువల్‌గా అడిగి తెలుసుకున్నారు.

గోపీకృష్ణ అతని వివరాలు చెప్తున్నప్పుడు అతనిని పరిశీలనగా చూసేరు విశ్వనాథంగారు.

''ఏం బాబూ వొంట్లో నలతగా వుందా?'' అన్నారు ఆప్యాయంగా.

''అవునండీ! ఫీవర్ వచ్చినట్లుంది. అందుకే పర్మిషన్ అడిగి బయల్దేరాను త్వరగా యింటికి వెళ్దామని. వర్షంలో చిక్కుకున్నా'' అన్నాడు.

''అలాగా! ఏదీ చెయ్యి యిటు యివ్వు'' అని పల్స్ చూసేరు.

''జ్వరం ఎక్కువగానే వుంది బాబూ! అమ్మా శారదా!'' అని పిల్చేరు.

తండ్రి పిలుపునకు సమాధానంగా శారద ఒక ట్రేలో రెండు కప్పులతో టీ, ఒక గ్లాసుతో మంచినీళ్లు తెచ్చింది.

కల్వంలో వున్న ఔషధం మరో నాలుగు పర్యాయాలు నూరి అందులో నుంచి కొద్దిగా తీసి కుంకుడు గింజంత ఉండ చేసి

''బాబూ యిది వేసుకో!'' అని మందు మంచి నీళ్లగ్లాసు అందించేరు విశ్వనాథంగారు.

గోపీకృష్ణ మందు నోట్లో వేసుకొని నీళ్లు త్రాగేడు. మందు విపరీతమైన చేదుగా వుంది. శారద యిచ్చిన టీ త్రాగేడు. కళ్లు మండుతున్నందున కళ్లు మూసుకొని కూర్చున్నాడు.

''కూర్చునేందుకు యిబ్బందిగా వుంటే ఆ బల్ల మీద కాస్సేపు పడుకో బాబూ! ఫర్వాలేదు. మొహమాట పడకు!'' అన్నారు.

అతను అలా అనడం తడవు వెంటనే గోపీకృష్ణ మోచేయి తలక్రింద పెట్టుకొని పడుక్కున్నాడు. యిర్వై నిముషాలు మంచి నిద్ర పట్టింది. చిరు చెమటలు పట్టి మెలకువ వచ్చింది.

''ఏం బాబూ వొంట్లో ఎలా వుందిప్పుడు!'' అన్నారు.

''బాగా రిలీఫ్ యిచ్చిందండీ! మెడిసన్ బాగా పని చేసింది'' అన్నాడు కృతజ్ఞతతో.

> **''మీ అమ్మగారు నాన్నగారు ఎంతో లోతు ఆలోచన గలవారు బాబూ! వారి ఆలోచన సరైందే! కోడలు అత్తమామలను గౌరవించాలని, సేవ చెయ్యాలని ప్రతివారూ కోరుకునేదే! అయితే జీవితం పంచుకోబోయేది నీవు కదా! నీ అభిరుచేమిటో వారు తెలుసుకోవాలి లేదా నువ్వే చెప్పాలి! యింతకూ నువ్వు ఎవరిని...'' అని యింకా ఏమో చెప్పబోయేరు విశ్వనాథం గారు.**

''చూడు మరొక మోతాదు మందిస్తాను. అది రాత్రి నిద్రపోయేముందు వేసుకో'' అని మరొక మోతాదు మందు పొట్లాం కట్టి యిచ్చేరు. ''వర్షం తెరిపిచ్చినట్లుంది! నేనింక బయల్దేరుతానండీ!'' అని గోపీకృష్ణ విశ్వనాథంగారికి నమస్కరించి లేచేడు.

''ఈ గొడుగు తీసుకొని వెళ్లు రేపు యిటొచ్చినప్పుడు తేవచ్చు. మాకు యింట్లో మరొకటి వుంది. యిబ్బంది లేదు'' అని బలవంతంగా గొడుగు యిచ్చి పంపేరు.

విశ్వనాథంగారు టీచర్‌గా పనిచేసి రిటైరయ్యేరు. ఉద్యోగరీత్యా ఎన్నోవూర్లు తిరిగి రిటైర్ అయ్యేక అతని భార్యకు ఆమె కన్నవారు యిచ్చిన రెండు గదుల పెంకుటిల్లు ఆ వూర్లో వుంటే చివరకు అందులో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. శారద వారి ఏకైక పుత్రిక. ఏడాది క్రితం విశ్వనాథంగారి భార్య విశాలాక్షి పోయేరు. విశ్వనాథంగారి ప్రవృత్తి ఆయుర్వేద మూలికావైద్యం. అది వారికి వంశపారంపర్యంగా వచ్చినది. వైద్యం కొరకు ప్రతిదినం ఎందరో అతని వద్దకు వచ్చి మందులు తీసుకొని ఎవరికి తోచింది వారిస్తారు. పేదలకు ఉచితంగా మందిస్తారు.

గోపీకృష్ణ యిల్లు చేరుకునే సరికి అతని తల్లి కాంతమ్మ గుమ్మంలో నిల్చుని వుంది. అతను సైకిల్ స్టాండ్ వేసి ఒక చేత్తో గొడుగు ఇంకో చేత్తో కేరేజీ పట్టుకొని వచ్చేడు.

''ఆ గొడుగెవరిదిరా? వర్షంలో ఎక్కడ చిక్కడిపోయేవో అనుకుని భయపడ్డాను. ఇదేమిటి కేరేజీ బరువుగా వుంది!'' అంటూ కొడుకు చేతిలో కేరేజి అందుకొని అడిగింది.

''కొద్దిగా ఫీవర్‌గావుంటే అన్నం తినలేదు. కేంటీన్‌లో బన్ తిని టీ త్రాగేను. జీతం తీసుకొని పర్మిషన్ అడిగి ముందుగా బయల్దేరి వూర్లో కొత్తపేట దగ్గర వర్షంలో చిక్కుకున్నాను'' అని తరువాత జరిగిందంతా చెప్పేడు.

కొడుకు చెప్పిందంతా విన్న కాంతమ్మ మనస్సు చలించింది. దగ్గరకు వెళ్లి నుదురు, బుగ్గలు, పొట్ట మీద చేయి వేసి చూసి వెచ్చగా లేనందుకు సంతోషించింది. అతను జేబులోని జీతం కవరు తీసి తల్లికి యిచ్చేడు. ఆమె కవర్లో సొమ్ము కేజువల్‌గా లెక్కించి ''ఆయనెవరో సమయానికి దేవుడిలా ఆదుకొని మంచి మందే యిచ్చేరు. ఆయనకు ఫీజు యివ్వలేదా?'' అంది.

''లేదమ్మా! మర్చిపోయేను!'' అన్నాడు కాస్త నొచ్చుకుని


''మర్యాదగా వుండదురా? రేపు వాళ్ళ గొడుగు తిరిగి యిచ్చేందుకు వెళ్లినపుడు మరిచిపోకుండా ఫీజు ఎంతో వారిని అడిగి యివ్వు!''

వారు మాట్లాడుకుంటున్న సమయంలో గోపీకృష్ణ తండ్రి సర్వోత్తమరావుగారొచ్చేరు. ఆయన ఒక ప్రైవేట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా వర్క్ చేసి రిటైర్ అయ్యేరు. వారికి ముగ్గురు కొడుకులు. పెద్దకొడుకు సుందర్రావు, రెండోవాడు వేంకటేశ్వర్లు. యిద్దరికీ పెద్దచదువులు చెప్పించేరు. పెద్దవాడు రాజమండ్రిలో లెక్చరర్, రెండోవాడు విజయవాడలో ఒక కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ ఇద్దరికీ పెళ్లిళ్ళయ్యేయి. వారు తండ్రికి ప్రతినెలా

గత 35 సంవత్సరాలుగా సర్వోత్తమరావుగారు వారు ప్రస్తుతం వున్న రెండు గదుల డాబాయింట్లో వుంటున్నారు. వారు ఆ యింటిని సొంత యింటికంటే పదిలంగా చూసుకుంటున్నారు. యింటి ఓనరు హైదరాబాద్‌లో వుంటున్నాడు. ఆమధ్యన ఓ పర్యాయం ఆయన వచ్చి ''యిల్లు అమ్మేద్దామనుకుంటున్నాను. మీరు చాలా కాలంగా అందులో వుంటున్నారు కనుక మీకైతే అన్నీ కలిపి రెండు లక్షలకిచ్చేస్తాను'' అన్నాడు.

''రిటైర్ అయ్యేక సొంత యిల్లు వుంటే శేషజీవితం ప్రశాంతంగా గడపవచ్చు!'' అనుకొని సర్వోత్తమ రావుగారు ఆయనకు వచ్చిన రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రెండున్నర లక్షలలో రెండు లక్షలు పెట్టి యిల్లుకొని దానిని భార్య పేర రాయించి, మిగిలిన సొమ్ము ఫిక్సడ్ డిపాజిట్ చేసేరు.

భర్త చేసిన పనికి కాంతమ్మ సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది.



సర్వోత్తమరావు రిటైర్ అయిన మూడోరోజు ఉదయం ఆయన కొడుకు లిద్దరూ భార్యాపిల్లల్ని తీసుకొని వచ్చేరు. తల్లికీ, తండ్రీ తమ్ముడికీ ఖరీదైన బట్టలు కొని తెచ్చి పెట్టేరు. అయితే వచ్చిన సొమ్ము అంతా వెచ్చించి తండ్రి ఆ పాత యిల్లు కొన్నందుకు చిందులు వేసేరు. తమ అవసరాలకు డబ్బు సర్దుబాటు చెయ్యలేదని కోపగించుకొని వెంటనే తిరుగు ప్రయాణమై వెళ్లిపోయేరు. ప్రతినెలా తండ్రికి పంపు చెరొక ఐదొందలు పంపుతున్నారు.

వారి మూడోకొడుకు గోపీకృష్ణ టెన్త్ చదువుతుండగా ఆయన రిటైర్ అయ్యేరు. సర్వోత్తమరావుగారు రిటైర్ అవడానికి నెలరోజుల ముందు ఆయన పెద్దకొడుకు సుందర్రావు ''నాన్నగారూ నాకు కాలేజీకి రానూ పోనూ 8 కిలోమీటర్లు రోజూ బస్సులలో ప్రయాణం చెయ్యడానికి యిబ్బందిగా వుంది. అందువల్ల మోటారు సైకిల్ కొందామనుకున్నా మీకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందగానే నాకు 50 వేలు పంపించండి. మోటార్ సైకిల్ కొనడానికి'' అని ఉత్తరం రాసేడు.

''సొంత కారున్న సూపర్‌వైజర్లకి మా కంపెనీవారు నెలకి రెండు వేలు వెహికల్ ఎలవెన్స్ యిస్తారు. అందుకని నేను సెకెండ్ హేండ్ మారుతీ కారు కొందామనుకుంటున్నాను. నాకు లక్ష రూపాయలు కావాలి. మీకు వచ్చే రిటైర్‌మెంట్ సొమ్ములోంచి పంపించండి'' అని వేంకటేశ్వర్లు ఉత్తరం రాసేడు.

కొడుకులు రాసిన ఉత్తరాలు చదివి అవాక్కయిపోయేరు సర్వోత్తమరావుగారు.

''అదే వింటండీ అలా రాసేరు వాళ్లు! గోపీగాడి చదువుంది! యింటి ఖర్చు! మీది గవర్నమెంట్ జాబ్ కాదు. నెల నెలా పెన్షన్ రావడానికి! వొచ్చేది కాస్త వాళ్లకిస్తే మన పరిస్థితి ఏమిటి?'' అంది కాంతమ్మ.

సర్వోత్తమరావుగారు చిరునవ్వు నవ్వి వూరుకున్నారు. కొడుకులకు సమాధానం రాయలేదు.

**రావి-ఎన్-అవధాని**

తున్న డబ్బు పంపడం మానివేసేరు.

కొడుకుల ప్రవర్తనకు కాంతమ్మ ఎంతో బాధపడింది. సర్వోత్తమరావుగారు అంతగా పట్టించుకోలేదు. రోజుకు మూడు గంటలు పనివుండే పార్ట్‌టైమ్ జాబు సంపాదించేరు. నెలకు రూ.1200యిస్తున్నారు వాళ్లు.

గోపీకృష్ణ టెన్త్ క్లాస్‌లో స్కూల్ ఫస్ట్, జిల్లాలో ఫస్ట్, స్టేట్‌లో సెకెండ్ వచ్చేడు. ఈ శుభవార్త అన్నలిద్దరికీ చెప్పి పై చదువు విషయం వారి సలహా పొంది వస్తానన్నాడు. తండ్రి కాదన లేదు రైలు ఖర్చులిచ్చేరు. కాంతమ్మ పిల్లలకోసం తినుబండారాలు చేసి మూటలు కట్టి యిచ్చింది. గోపీకృష్ణకు అన్నలింట ఏమాత్రం ఆదరణ లభించలేదు.

''నెత్తిమీద యిన్ని ఖర్చులుంచుకొని ముందూ వెనుకా చూడకుండా చేతికందిన సొమ్మంతా పోసి ఆ పాత కొంప కొని చేతులు దులుపుకొని కూర్చున్నారు ఆయన్నే అడుగు సలహా!'' అన్నారు.

''వారి ఎత్తిపొడుపు మాటలకు గోపీకృష్ణ ఏమాత్రం దిగులు చెందలేదు. పై చదువుల విషయం యిక ఆలోచించలేదు. అతను టెన్త్ చదువుతున్నప్పుడే టైప్, షార్ట్ నేర్చుకున్నాడు. ఫ్రెండ్ ఫాదర్ ద్వారా ఆనందపురం ఫ్యాక్టరీలో నెలకు రూ.1500/- జీతం మీద టైపిస్ట్ జాబ్ సంపాదించేడు. రెండేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు గోపీకృష్ణ.

విశ్వనాధంగారి గొడుగు వాపస్ చెయ్యడానికి మర్నాడుదయం వారింటికి బయల్దేరేడు గోపీకృష్ణ. కొన్ని అరటిపళ్లు వారికివ్వమని అతని తల్లి యిచ్చింది. అవి వారి పెరటి అరటి చెట్టువి. అతను వారింటికి వెళ్లేసరికి తండ్రీ కూతురు గార్డెన్ వర్క్ చేస్తున్నారు. అతన్ని చూసి శారద యింట్లోకి వెళ్లిపోయింది. విశ్వనాధంగారు చిరునవ్వు నవ్వి చేతులకూ కాళ్లకూ అంటుకొన్న మట్టిని కడుక్కొని '' రా బాబూ! ఎలావుంది ఒంట్లో!?'' అని కుశల ప్రశ్నలు వేశారు.

''కులాసాగా వుందండీ! మళ్లీ జ్వరం రాలేదు!'' అని అరటిపళ్లు ఆయన చేతిలో వుంచి నమస్కరించేడు.

''యివెందుకు తెచ్చావుబాబూ!'' అన్నారు అభిమానంగా

''మా దొడ్లో చెట్టువండీ! అమ్మ యివ్వమని యిచ్చింది''

విశ్వనాధంగారు గోపీకృష్ణ నాడి మళ్లీ చూసి ''యిక మందు అవసరంలేదు'' అన్నారు.

శారద టీ తెచ్చి యిచ్చింది.

''ఇప్పుడెందుకండీ యిది!'' అన్నాడు మొహమాటంగా.

''ఎందుకేంటి త్రాగడానికి!'' అంది చిరునవ్వుతో.

అప్పుడు చూసేడు ఆమె ముఖంలోకి. చురుకైన కళ్లు, మనిషి ఎంతో నాజూకుగా అందంగా వుంది. ఆమె అదే సమయంలో అతని పర్సనాల్టీ అందం చూసి ముగ్ధురాలైంది.

''అంకుల్ నాకు మంచి మందిచ్చేరు మరి ఫీజు...?''

''యిచ్చేవుగా!'' అంటూ ప్రక్కనున్న పళ్లు చూపించి, ''మరేం వద్దులే!'' అని గోపీకృష్ణ కుటుంబ వివరాలన్నీ అడిగి తెలుసుకొని తృప్తిపడ్డారు.

గోపీకృష్ణ తరుచు విశ్వనాధంగారింటికి వెళ్లి శారదతోనూ ఆయనతోనూ సరదాగా కాస్సేపు మాట్లాడి వస్తున్నాడు.

ఒకరోజు విశ్వనాధంగారు బజారులో పేవ్‌మెంట్ మీద కాస్త పరధ్యాన్నంగా నెమ్మదిగా నడుస్తున్నారు. యింతలో మారుతీకారొకటి వచ్చి పేవ్‌మెంట్ ప్రక్కనే ఆగింది. అందులోంచి 28 ఏళ్ల యువకుడు దిగి విశ్వనాధంగారికి ఎదురుగా వచ్చి ''నమస్కారం అంకుల్!'' అన్నాడు.

విశ్వనాధంగారు ''ఎవరుబాబు మీరు! గుర్తుపట్టలేదు!'' అన్నారు.

''నేను అంకుల్! వినయ్‌ని! శ్రీపతిగారి అబ్బాయిని''

''ఏమిటీ! శ్రీపతిగారి వినయ్‌వా? ఎంత వాడివయ్యావ్! యిరవై ఏళ్లయింది కదూ! గుర్తుపట్టలేదు. ఎక్కడుంటున్నావ్? ఏం చేస్తున్నావ్! అమ్మా నాన్నా బావున్నారా?''

''అంకుల్ ప్రక్కసందులోనే మా ఆఫీసుంది. రండి అక్కడ కూర్చుని మాట్లాడుకుందాము'' అని విశ్వనాధంగారిని కారులో తన ఆఫీసుకు తీసుకొని వెళ్లేడు వినయ్.

ఆఫీసు డెకొరేషన్ ఖరీదైన ఫర్నీచర్ చూసి ఆశ్చర్యపోయేరు. వారు రూమ్‌లో అడుగుపెట్టగానే ప్యూన్ వచ్చి ఏ.సీ. ఆన్ చేసి వారికి ఏపిల్ జ్యూస్ యిచ్చేడు.

''అంకుల్ నేను ఎమ్.బి.ఏ పూర్తి చేసి వచ్చేసరికి ఫాదర్ పోయేరు..''

''ఏమిటీ? శ్రీపతిగారు..''

''అవును అంకుల్. వన్ యియర్ అయింది హార్ట్ ఎటాక్! మాకు శ్రీపతి ఎంటర్‌ప్రైజెస్ అని బిజినెస్ వుంది. దాని హెడ్డాఫీసు హైదరాబాద్‌లో వుంది. విజయవాడ, గుంటూర్లలో బ్రాంచిలున్నాయి. రెండు నెలల క్రితం యీ వూర్లో యీ బ్రాంచి ఓపెన్ చేసేను. మదర్ హైదరాబాద్‌లో వున్నారు''

''యింత చిన్న వయస్సులో ఎన్ని బాధ్యతలు మీద పడ్డాయి! మేరేజ్ అయిందా? పిల్లలు?''

''లేదంకుల్ మేరేజ్ అవలేదు''

వారు ఒక గంటసేపు పాత విషయాలన్నీ మాట్లాడుకున్నారు.

శ్రీపతిగారి బంగ్లా ఎదురింటిలో విశ్వనాధంగారుండే వారు. వినయ్‌కి పది నెలల వయస్సప్పుడు, చిన్నపిల్లల జబ్బు చేసింది. శ్రీపతిగారు కేంపులో వున్నారు. అప్పుడు విశ్వనాధంగారు అతని మూలికావైద్యంతో నయం చేసేరు. ఈ విషయం వినయ్‌కి ఎన్నో పర్యాయాలు అతని తల్లి విజయ లక్ష్మిగారు చెప్పేరు. ఆ సంఘటన ద్వారా రెండు కుటుంబాలూ ఎంతో సన్నిహితమయ్యేయి. సుమారు పది సంవత్సరాలు వారు ఎంతో స్నేహంగా వున్నారు.

విశ్వనాధంగారు ట్రాన్స్‌ఫరై ఆ వూరు వదిలి వెళ్తున్నప్పుడు రెండు కుటుంబాల వారు కలసి గ్రూప్ ఫోటో తీయించుకున్నారు. దాని కాపీ ఒకటి వినయ్ టేబిల్ మీద చక్కటి ఫ్రేమ్‌తో వుంది.

వినయ్ విశ్వనాధంగారిల్లు ఎక్కడుందో అడిగి తెల్సుకుని

''పదండి అంకుల్ నేనూ అటే పనిమీద వెళ్తున్నాను. మిమ్మల్ని యింటివద్ద దింపి అటు వెళ్తాను'' అని అతనిని తీసుకొని బయల్దేరేడు.

యింటి ముందు మారుతీకారు ఆగడం అందులోంచి తండ్రి దిగడం చూసి ఆశ్చర్యపడి ఎదురు వెళ్ళబోయి తండ్రితో నవ్వుతూ వస్తున్న యువకుడిని చూసి ఆగిపోయింది శారద.

''అమ్మా శారదా! ఎవరనుకున్నావితను! వినయ్! శ్రీపతి అంకుల్‌గారి అబ్బాయి!'' అన్నారు ఆనందం పట్టలేక.


''నమస్కారం!'' అని ''మనింట్లో గ్రూప్ ఫోటోలో...''

''అవునమ్మా అతనే!'' ''బాబూ మా అమ్మాయి శారద''

వారి చూపులు క్షణ కాలం కలుసుకున్నాయి. శారద సిగ్గుతో ముడుచుకొని ''కాఫీ తెస్తాను'' అని లోనికి వెళ్లబోయింది.

అది కాఫీ, టీ తీసుకునే టైం కాదని వినయ్ ఆమెను వారించేడు.

''ఈసారి వచ్చినప్పుడు మీ ఆతిధ్యం స్వీకరిస్తాను'' అని ''అన్నట్లు అంకుల్ మీ దృష్టిలో మన వాళ్లబ్బాయి నమ్మదగినవాడు, చురుకైనవాడు, నెమ్మదస్తుడు, టైపింగు తెలిసినవాడు ఎవరైనా వున్నారా? యిక్కడ మా ఆఫీసులో



డిప్యూటీ సేల్స్ మేనేజర్‌గా పనిచేయడానికి'' అన్నాడు వినయ్.

విశ్వనాధంగారు ఆలోచించే లోపల శారద గోపీకృష్ణ గురించి చెప్పింది.

''నువ్వు చెప్పిన క్వాలిటీస్ అన్నీ వున్న కుర్రాడు గోపీకృష్ణ వున్నాడు బాబు'' అన్నారు.

''రేపు ఉదయం పది గంటలకు నన్ను కలవమనండి'' అని తన విజిటింగ్ కార్డ్ యిచ్చి వెళ్లిపోయాడు.

వినయ్ జాబ్ యిస్తానన్న సంగతి చెప్పి మర్నాడు ఉదయం 10 గంటలకు విశ్వనాధంగారు స్వయంగా గోపీకృష్ణను తీసుకొని వెళ్లి వినయ్‌కి పరిచయం చేసేరు.

గోపీకృష్ణ పర్సనాల్టీ, సర్టిఫికేట్స్, అవి చూసి మూడు లెటర్స్ డిక్టేట్ చేసి టైప్ చేసి తీసుకొని రమ్మన్నాడు వినయ్. అతను లెటర్స్ టైప్ చేసి తీసుకొని వచ్చాడు. వర్క్ ఎంతో నీట్‌గా వుంది.

వినయ్ టేబిల్ డ్రాయర్‌లోంచి లెటర్ తీసి విశ్వనాధంగారికిచ్చి ''చూడండి అంకుల్!'' అన్నాడు.

విశ్వనాధంగారు లెటర్ అందుకొని చదివేరు. అతని కళ్లు ఆనందంతో మిలమిలా మెరిసేయి. అది గోపీకృష్ణను నెలకు రూ.4000/- జీతం మీద డిప్యూటీ సేల్స్ మేనేజర్‌గా ఎపాయింట్ చేసినట్లు ఆర్డర్.

గోపీకృష్ణ ఆనందానికి అవధుల్లేవు.

జాయినింగ్ రిపోర్ట్ వెంటనే రాసిచ్చేడు. అతడిని వినయ్ మిగిలిన స్టాఫ్‌కి పరిచయం చేసేడు.

ఆఫీస్‌వారు గోపీ కృష్ణ యింటికి సెల్యులర్ ఫోను, ఆఫీస్ వర్క్‌కి జీపు యిచ్చేరు.

తండ్రి చేస్తున్న పార్ట్‌టైమ్ జాబ్ మానిపించి రెస్ట్ తీసుకోమన్నాడు. కాంతమ్మగారికి తెల్లవారకుండా వంట చేసి కేరేజీ సర్దాల్సిన బాధ తప్పింది. పది గంటలకు టిఫెన్ చేసి ఆఫీసుకు వెళ్లి ఒంటి గంటకు వచ్చి భోజనం చేస్తున్నాడు. చేతిలో జీపు వుంది. నీడ పట్టున ఉద్యోగం. గోపీకృష్ణ యిప్పుడు ఎంతో అందంగా హుందాగా, హుషారుగా కనిపిస్తున్నాడు. అదే విషయం విశ్వనాధం గారు శారద అన్నారు.

మరిదికి మంచి ఉద్యోగం. పెద్ద జీతం, హోదా వచ్చిందని తెలియగానే గోపీకృష్ణ వదినెల మనస్సుల్లో చక్కటి ఆలోనలు వచ్చాయి.

పెద్ద వదినె చెల్లెలు నీలిమ హోమ్ సైన్స్‌లో డిగ్రీ పుచ్చుకుంది. చెల్లెల్ని వెంట తీసుకొని పెద్ద కోడలు హఠాత్తుగా రావడంతో కాంతమ్మ విస్తుపోయింది.

''మిమ్మల్ని చూడాలనిపించింది! ఆయనకు శలవు లేదన్నారు. మా చెల్లెలు కాళీగా వుంది. తోడుగా బయల్దేరి వచ్చేను'' అంది లౌక్యంగా.

నీలిమ ఎంతో గడుసైన పిల్ల! గుమ్మంలో అడుగు పెట్టగానే ''అత్తయ్యా ! పెద్దవారు మీరలా కూర్చోండి!'' అని కాంతమ్మ చేతిలో పని అందుకొని చకచకా చేస్తోంది.

''అత్తయ్యా! మన గోపీకి నీలిమను చేసుకుంటే బావుంటుంది అని మీ అబ్బాయి చెప్పమన్నారు. అంతేకాదు మనలో మనకి ఫార్మాలిటీసేంటి నీలిమను తీసుకొని వెళ్లు అమ్మకు హెల్ప్‌గా వుంటుంది'' అని పంపించేరు అంది.

''గోపీని అడిగిన తరువాత చెప్తా'' మన్నారు.

మరోవారం రోజుల తర్వాత వేంకటేశ్వర్లు, భార్య ఆమె పినతండ్రి వచ్చేరు. రెండోకొడుకు ''పినమామగారి అమ్మాయి చంద్రవదనను గోపీకి చేసుకోమన్నాడు. పిల్ల ఫోటో తెచ్చి చూపి అమ్మాయి మంచి అందకత్తె అని డిగ్రీ చదువుతోందని కట్నం ఘనంగా యిస్తారని'' చెప్పేడు.

''అబ్బాయి ఉద్యోగం రెండు నెలల్లో పర్మనెంట్ అవుతుంది. ఆ తరువాత పెళ్లి విషయంలో ఆలోచిస్తానన్నాడని'' చెప్పేరు.

గోపీకి చంద్రవదనను చేసుకోమని పలుమార్లు తండ్రిని హెచ్చరించి వెళ్లేడు వెంకటేశ్వర్లు.

సర్వోత్తమరావు కాంతమ్మగారలు గొప్ప యిరకాటంలో పడ్డారు. యిద్దరు పిల్లలూ అందచందాలలో సమానులే. యిరువురూ ఎంతో దగ్గరవారే! ఎవరినీ అవునన లేరు కాదనలేరు.

గోపీకృష్ణను ఎన్ని పర్యాయాలు అడిగినా అతడు ''మీ యిష్టం'' అని తప్పించుకుంటున్నాడు.

గోపీకృష్ణ పెళ్లి విషయంలో యింట్లో జరుగుతున్న డ్రామా ఎంతో గొప్పగా వర్ణించి విశ్వనాధంగారికి శారదకు చెప్పేడు.

''మీ అమ్మగారు నాన్నగారు ఎంతో లోతు ఆలోచన గలవారు బాబూ! వారి ఆలోచన సరైందే! కోడలు అత్తమామలను గౌరవించాలని, సేవ చెయ్యాలని ప్రతివారూ కోరుకునేదే! అయితే జీవితం పంచుకోబోయేది నీవు కదా! నీ అభిరుచేమిటో వారు తెలుసుకోవాలి లేదా నువ్వే చెప్పాలి! యింతకూ నువ్వు ఎవరిని...'' అని యింకా ఏమో చెప్పబోయేరు విశ్వనాధం గారు.

''నాన్నగారూ! యీ విషయం అతని పర్సనల్ మేటర్. అంతే కాదు కుటుంబ సమస్య! మీరు జోక్యం కల్గించుకోవటం మంచిది కాదు'' అని తండ్రిని మందలించింది శారద.

మర్నాడుదయం గోపీకృష్ణ ఆఫీసుకి వెళ్లి అక్కడి వాతావరణంలో ఎంతో మార్పు గమనించేడు. బాస్‌రూమ్‌లోంచి బయటకువచ్చిన రీజినల్ మేనేజర్ అశ్వపతి గారిని చూసి విష్ చేసేడు.

''కమాన్ గోపీ కృష్ణా మీ కోసమే వెయిట్ చేస్తున్నా'' అని అతడిని బాస్ రూమ్‌లోనికి తీసుకొని వెళ్లేరు.

బాస్‌రూమ్‌లో అడుగుపెట్టిన గోపీకృష్ణ షాక్ అయ్యేడు. బాస్ సీట్లో కూర్చుని శారద చెక్కుల మీద సంతకాలు చేస్తోంది. ఎదురుగా కేషియర్ పున్నారావు నిల్చుని వున్నాడు. అతను షాక్‌లోంచి తేరుకోకమునుపే.

''మేడమ్! యితను గోపీకృష్ణ డిప్యూటీ సేల్స్ మేనేజర్ వారు మిస్ శారద! ఛీఫ్ ఎగ్జిక్యూటివ్!'' అని యింట్రడ్యూస్ చేసేరు.

గోపీకృష్ణ అప్రయత్నంగా చేతులు జోడించి నమస్కరించి అశ్వపతిగారితో బయటకు వచ్చేడు.

''మేడమ్‌గారికి యీ పోస్ట్ నాలుగు నెలల క్రితమే మన ఎమ్.డి. గారు ఆఫర్ చేసేరు. అయితే ఏవో పర్సనల్ రీజన్స్ వల్ల మేడమ్‌గారు యిన్నాళ్లూ పెండింగ్‌లో వుంచి యీ రోజే డిసైడ్ చేసి జాయిన్ అయ్యేరు. అంతేకాదు మేడమ్‌గారు మన ఎమ్.డి గారికి కాబోయే భార్య! ఆ విషయం కూడా యీరోజే డిసైడ్ అయింది'' అన్న అశ్వపతి గారి మాటలకు గోపీకృష్ణ కళ్లు చీకట్లు కమ్మేయి. ☆

